శ్రీ ఆచార్య N.G. రంగా గారి శత జయంతి

ఉత్సవాల సందర్భంగా

# రైతు క్లబ్స్ - వర్క్‌షాపు

**1-11-2001**

**రంగా భవన్**

సంతపేట, ఒంగోలు.

# డబ్ల్యు. టి. ఓ.

# సవాళ్ళు - అవకాశములు


## వడ్డే శోభనాద్రీశ్వరరావు

వ్యవసాయ శాఖామాత్యులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఇటీవల కాలంలో పలు రాష్ట్రాలలో ధాన్యం, మొక్కజొన్నలు, వేరుశనగ, మిర్చి, ఆయిల్ పామ్ గుత్తులు మున్నగు వ్యవసాయ ఉత్పత్తులకు సరియైన ధరలు లభించక రైతులు ఆందోళనకు గురైనారు. అక్టోబరు, నవంబరు మాసాలలో పాత ధాన్యానికి మంచి ధర పలుకుతూ వుండేది. కాబట్టి ఖరీఫ్ పంట వచ్చిన వెంటనే అమ్ముకోవలసిన అవసరంలేక నిల్వ చేసుకొన్న రైతులకు కనీస మద్దతు ధర లభించడం గగనమైంది. ఈ సంవత్సరం పులిమీద పుట్రలా చైనా నుంచి కారుచౌకగా బియ్యం దిగుమతి అవుతూ వుందని వచ్చిన పత్రికల్లోని వార్తలు రైతులను మరింత భయాందోళనలకు గురిచేశాయి. మిల్లర్లు, దళారీలు యీ ప్రచారాన్ని తమ స్వార్థం కొరకు ఉపయోగించుకొన్నారు. ఇతర దేశాల నుండి పాలపొడి, పాల ఉత్పత్తులు దిగుమతి అవడం మూలాన, పంజాబులో పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని అక్కడ రైతులు నిరసన వ్యక్తం చేశారు. మలేషియా నుండి పామోలిన్ నూనె చాలా అధిక పరిమాణంలో దిగుమతి అయినందున మన దేశంలో పామోలిన్ నూనె, వేరుశనగ నూనె, కొబ్బరినూనెల ధరలు తగ్గి వీటిని పండిస్తున్న రైతులను నిరాశా నిస్పృహలకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలామంది రైతుల్లో ప్రపంచ వాణిజ్య సంస్థ అంటే ఏమిటి? దానివలన మన దేశమునకు, వ్యవసాయదారులకు ఏ మేరకు లాభం వుంది? ఏ మేరకు నష్టం వాటిల్లవచ్చు? నష్ట కష్టాలను ఎలా అధిగమించగలం అనే ఆలోచనలు రైతాంగంలో చోటుచేసుకున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.వో) ఆవిర్భవించిన ఆరు సంవత్సరాలు దాటిన తర్వాతనైనా యీ పరిణామం రావడం కొంతవరకు నయమే. ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో వ్యవసాయ ఒప్పందం, సంబంధిత అంశాలపైనా అవగాహన ఎంతైనా అవసరం.

## పరిచయం

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన దరిమిలా వివిధ దేశాల్లో పునర్‌నిర్మాణం, అభివృద్ధికి తోడ్పడటం కొరకు ప్రపంచ బ్యాంకును, వివిధ దేశాల కరెన్సీ సంబంధిత -అంశాలు, ఋణ సదుపాయం కల్పించడం కొరకు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్) మరియు వివిధ దేశముల మధ్య వర్తక, వాణిజ్యములను ప్రోత్సహించేందుకు, సుంకములను తగ్గించేందుకు "గాట్" సంస్థను కొన్నిదేశాలు "బ్రెట్టెన్‌వుడ్స్" అను ప్రదేశంలో సమావేశమై ఏర్పాటుచేశాయి. 1948లో "గాట్"ను స్థాపించిన 28 దేశాలలో భారతదేశం కూడా వుంది. దరిమిలా ఏడు రౌండ్ల సమావేశాలు జరిగాయి. క్రమేపీ సుంకాలలో మార్పులు, తగ్గింపుల ద్వారా ప్రపంచ వాణిజ్యమును పెంపొందించేందుకు చర్యలు

తీసుకోబడ్డాయి. ఎనిమిదవ రౌండు ఉరుగ్వే దేశంలో 1986లో ప్రారంభమైంది. చర్చల్లో పలు పర్యాయాలు ప్రతిష్టంభన ఏర్పడింది. అమెరికా యూరోపియన్ యూనియన్‌ల మధ్య వివాదం చాలాకాలం నడిచింది. అప్పటి గాట్ డైరెక్టర్ జనరల్ అర్థర్ డంకెల్ తానే ఒక ముసాయిదాను తయారుచేసి సభ్యదేశాలను ఆ డంకెల్ ముసాయిదాను మొత్తంగా ఆమోదించితే ఆమోదించండి లేకపోతే తిరస్కరించండి అని ప్రతిపాదించాడు. 1993 డిసెంబర్ 15న సుమారు 124 దేశాలు డంకెల్ ముసాయిదాను ఆమోదించాయి. 1994 ఏప్రిల్‌లో వివిధ దేశాల మంత్రులు ఈ ముసాయిదాపై భారతదేశంతో సహా సంతకాలు చేశాయి. 1995 జనవరి 1వ తేదీ నుండి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.వో) అమల్లోకి వచ్చింది.

## ఉరుగ్వే సమావేశానంతర పరిస్థితులు - వాటి ప్రభావాలు

ఉరుగ్వే రౌండులో నిర్ధారించబడిన అంశాలలో ముఖ్యమైనవి (ఎ) వ్యవసాయ ఒప్పందము (బి) ట్రిప్పు, (సి) ట్రిమ్సు (డి) గాట్సు, (యి) శానిటరీ, ఫైటో శానిటరీ స్టాండర్డ్స్. వీటిల్లో వ్యవసాయరంగాన్ని ప్రభావితం చేయగల్గినవి మూడు అంశాలు ప్రధానంగా వుంటాయి. వ్యవసాయ ఒప్పందం, వాణిజ్యపర మేధో సంపత్తి హక్కులు (ట్రిప్పు) మరియు శానిటరీ, ఫైటో శానిటరీ స్టాండర్డ్స్ (ఎస్.పి.యస్). ఉరుగ్వే రౌండు 1986 నుండి 1994 వరకు కొనసాగింది. అంటే దాదాపు ఎనిమిది సంవత్సరాలపాటు దేశ ఆర్థిక విధానాలను, కోట్లాదిమంది ప్రజల జీవన పరిస్థితులను ప్రభావితం చేయగల డంకెల్ ముసాయిదాలోని వివిధ అంశాల గురించి, వాటివలన మన దేశానికి చేకూరగల ప్రయోజనాలు, మన వ్యవసాయ రంగానికి ఏవిధంగా ఏమేరకు లాభం చేకూరవచ్చు లేక ఏమేరకు నష్టం వాటిల్లగల పరిస్థితి వుండవచ్చు. దానిని ఎలా అధిగమించవచ్చునో అనే అంశాల గురించి ప్రజలకు ముఖ్యంగా రైతులకు తెలియజెప్పే ప్రయత్నమును ఆనాటి కేంద్ర ప్రభుత్వం చేయలేదు.

వాస్తవానికి మన రాజ్యాంగం ప్రకారం 'వ్యవసాయం' రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వున్న అంశం అయినప్పటికీ "నిత్యావసర వస్తువుల చట్టం", "ఎగుమతులు - దిగుమతుల విధానం", "వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను" నిర్ణయించడం, గోధుమలు, బియ్యం, వంటి వ్యవసాయ ఉత్పత్తుల సేకరణను కేంద్ర ప్రభుత్వమే చేపట్టినందున మన దేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఆనాటి కేంద్ర ప్రభుత్వం డంకెల్ డ్రాఫ్టు విషయంలో ఉదాసీనంగా

వ్యవహరించింది. అందులోని అంశాల వలన ఎటువంటి పరిణామాలు మన వ్యవసాయ రంగంలో సంభవించగలవో సరిగా అంచనా వేయలేదు. డబ్ల్యు.టి.వో. వలన మన దేశానికి ముఖ్యంగా రైతులకు చాలా మేలు చేకూరుతుందని నాటి పాలకులు చెప్పారు. ఇతర దేశాలలో సబ్సిడీలు తగ్గిపోతాయి కాబట్టి అక్కడ ధరలు పెరుగుతాయి. మన దేశం నుండి అధికంగా వ్యవసాయ ఉత్పత్తులు యితర దేశాలకు ఎగుమతి అవుతాయి. మన రైతులకు మంచి ధరలు లభించుతాయి అని వారు సెలవిచ్చారు. సభ్యులు కోరిన మీదట, పట్టుపట్టిన మీదట పార్లమెంటులో డంకెల్ డ్రాఫ్ట్ గురించి చర్చ జరిగింది. గాట్ ఒప్పందంపైన భారత ప్రభుత్వం సంతకం చేసిన తర్వాత డబ్ల్యు.టి.వో స్థాపించబడిన తర్వాత కొంతకాలానికి మన వాణిజ్య శాఖ పార్లమెంటు స్టాండింగ్ కమిటి గాట్ ఒప్పందమును పరిశీలించింది. గాట్ ఒప్పందములోని అనేక అంశాలు మనదేశ ప్రయోజనాలకు అనుగుణంగా లేవని, ఈ ఒప్పందము వలన అభివృద్ధి చెందిన దేశాలకే అధికంగా లాభాలు చేకూరుతాయని అభిప్రాయపడింది. అయితే రానున్న సమీక్షా చర్చలలో మన వర్ధమాన దేశాలకు నష్టం చేకూరుస్తూ వున్న అంశములపైన మిగతా వర్ధమాన దేశాలతో సమిష్టి కృషి సల్పి వాటిని మార్పించవలసిన అవసరముందని భావించింది.

వివిధ దేశాల మధ్య వర్తకాన్ని, వాణిజ్యమును బాగా పెంపొందించడం గాట్ ఆశయం. పరిమాణాత్మక అంక్షలు, లైసెన్సులు, టారిఫ్ కోటాల వంటి అడ్డంకులను తొలగించి ప్రపంచ వాణిజ్యాన్ని, ఆదాయాన్ని పెంచాలన్న లక్ష్యం వున్నా ఆచరణలో అందుకు భిన్నంగా ఫలితాలు చేకూర్చగల నిబంధనలను తెలివిగా పారిశ్రామిక దేశాలు డంకెల్ ద్వారా ఆ ముసాయిదాలో పొందుపరచడంలో సఫలీకృతమైనాయి. వాణిజ్య విస్తృతికి అడ్డంకులను తొలగించాలని చెప్తూనే తమ దేశాలలోకి వర్ధమాన దేశముల నుండి ఎగుమతులను నిరోధించడానికి ఉద్దేశించిన అడ్డంకులను సడలించకుండానే సరిపెట్టారు. అభివృద్ధి చెందుతూ వున్న దేశాలకు సబ్సిడీల భారాన్ని తగ్గించుకోమని హితోక్తులను పలుకుతూ తమ దేశాల్లో చాల హెచ్చు స్థాయిలో వ్యవసాయ రంగానికి, ఎగుమతులకు యిస్తూ వున్న సబ్సిడీలను భవిష్యత్‌లో కూడా కొనసాగించేలా నిబంధనలు వుండే విధంగా అభివృద్ధి చెందిన దేశాలు చేసుకున్నాయి. లోగడే కఠినంగా వున్న శానిటరీ, ఫైటో శానిటరీ ప్రమాణాలను మరింత కఠినంగా చేయడం నాన్ టారిఫ్ అడ్డంకులను కల్పించడమే. పర్యవసానంగా అభివృద్ధి చెందుతూ వున్న దేశాల నుండి జపాన్‌కు ఎగుమతులు 1994లో 14.5 శాతం నుండి 1999 నాటికి 11.5 శాతమునకు తగ్గిపోయాయి. అలాగే పశ్చిమ యూరోపునకు అదేకాలంలో ఎగుమతులు 28.5 శాతం నుండి 28 శాతంకు పడిపోయాయి.

ముందు ఊహించిన దానికి భిన్నంగా మన దేశంలోకి అనేక వ్యవసాయ ఉత్పత్తులు హెచ్చు స్థాయిలో దిగుమతి అవుచున్నాయి. ఒకవైపు ఏటేటా పెరుగుతూ వున్న వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు మరొకవంక గిట్టుబాటు కాని ధరలకు అమ్ముకోవలసిన దుస్థితిలో రైతు సతమతమవుతున్నాడు. చైనా నుండి వాస్తవానికి బియ్యం దిగుమతి కాకపోయినా పుకార్లు బ్రహ్మాండంగా షికార్లు చేస్తున్నాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ పంట కాలంలో ధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు మద్దతు ధరలను యిప్పించడానికి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు తీవ్రంగా కృషి చేశారు. ఎప్పటికప్పుడు సమీక్ష జరిపినందునే నిరుడు యిదే సమయానికి సుమారు 43.00 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించగా, యీ సంవత్సరం 56.00 లక్షల టన్నుల సేకరణ జరిగింది. అయినా యిప్పుడు మళ్ళీ రబీ ఆందోళనలో వున్న రైతులను యిటువంటి పుకార్లు భయానికి గురిచేస్తున్నాయి. అందువలననే చాలామంది రైతులకు డబ్ల్యు.టి.వో. అంటే తెలుసుకోవాలనే ఆసక్తి ఈనాడు కలిగింది.

**ముఖ్య అంశాలు:**

వ్యవసాయ ఒప్పందంలో మూడు ప్రధానమైన అంశాలు వున్నాయి. (1) మార్కెట్ ప్రవేశం (2) దేశీయంగా వ్యవసాయానికి మద్దతు (3) ఎగుమతి సబ్సిడీలు. లోగడ పరిమాణాత్మక ఆంక్షలు, లైసెన్సింగు విధానం, కోటాల పద్ధతులను విడనాడి యితర దేశాల నుండి వచ్చు వస్తువులు దిగుమతి అయ్యేందుకు అనుమతించాలి. ఒకవేళ దిగుమతి చేసుకోవలసిన దేశం కొన్ని వస్తువులను దిగుమతి చేసుకోనవసరం లేదని భావించితే, అలా దిగుమతి చేసుకొన్నందువలన దేశ ప్రయోజనాలకు భంగం కలుగుతుందని భావించితే, హెచ్చు స్థాయిలో దిగుమతి సుంకాలను ఆ వస్తువుపై విధించడం ద్వారా దిగుమతులను అరికట్టేందుకు వీలు కల్పించబడింది. 1986-88 మధ్యకాలంలో దిగుమతుల స్థాయిని కొనసాగించాలని దేశీయంగా 86-88 నాటికి వినియోగిస్తూ వున్న వ్యవసాయ ఉత్పత్తులలో కనీసం 3 శాతం నుండి క్రీస్తు శకం 2004 నాటికి 5 శాతంకు అభివృద్ధి చెందుతూ వున్న దేశాలు దిగుమతులను అనుమతించాలనీ, క్రీ.శ. 2000 నాటికి అభివృద్ధి చెందిన దేశాలు దిగుమతులను అనుమతించాలనీ పేర్కొనబడింది. వివిధ దేశాలు అనాటికి వివిధ వస్తువులపైన తాము విధించుతూ వున్న దిగుమతి సుంకాల వివరాలను, భవిష్యత్తులో తాము అత్యధిక స్థాయిలో విధించతలపెట్టిన సుంకాల వివరాలను తెలియపరిచాయి.

## అభివృద్ధి చెందిన దేశాలు అనుసరించిన వ్యూహం

అభివృద్ధి చెందిన దేశాలు తమ దేశాల్లోకి దిగుమతయ్యే పలు వ్యవసాయ ఉత్పత్తులపైన చాలా అధిక స్థాయిలో దిగుమతి సుంకాలను విధిస్తున్నాయి. ఉదాహరణకు అమెరికాలో చక్కెరపైన 244 శాతం, వేరుశనగపైన 174 శాతం, యూరప్‌లో గొడ్డు మాంసం పైన 213 శాతం, గోధుమల పైన 168 శాతం, గొర్రె మాంసంపైన 144 శాతం దిగుమతి సుంకాలను విధిస్తున్నాయి. కెనడాలో వెన్నపైన 360 శాతం, కోడిగ్రుడ్లపైన 236 శాతం, జపాన్‌లో గోధుమలపైన 353 శాతం, గోధుమలతో తయారైన దినుసులపైన 388 శాతం, బార్లీతో తయారైన దినుసులపైన 361 శాతం, బియ్యంపైన 1000 శాతం మేరకు దిగుమతి సుంకాలను విధిస్తున్నాయి. దీని అర్థం ఏమంటే వారి దేశాలలోకి వారు వద్దు అనుకునే వస్తువుల దిగుమతులను నిరుత్సాహపరచడం కొరకు ఈ విధంగా హెచ్చు స్థాయిలో దిగుమతి సుంకాలను విధిస్తున్నారు. జపాన్ చర్చలో బియ్యం దిగుమతికి ససేమిరా వీల్లేదన్నది. చిట్టచివర్లో అంగీకరించింది. కాని 1000 శాతం సుంకం విధించితే ఒక్క బస్తా బియ్యం కూడా జపాన్‌లోకి ప్రవేశించే అవకాశం వుండదు.

## భారతదేశం అనుసరించిన విధానం - పరిమాణం

మన భారతదేశం ప్రాథమిక వ్యవసాయ ఉత్పత్తులపైన 100 శాతం, సెకండరీ ఉత్పత్తులపైన 150 శాతం, వంటనూనెలపైన 300 శాతం మేరకు అత్యధిక సుంకాలను (బౌండు టారిఫ్) విధించెదనని తేల్చింది. డబ్ల్యుటిఓ ఆవిర్భావం నాటికి మన దేశంలోకి దిగుమతయ్యే కొన్ని వస్తువులపై సుంకాలను పెంచవలసింది పోయి తగ్గించింది. అంతేకాక చాలా ఎక్కువ పరిమాణంలో పామోలిన్ ఆయిల్‌ను దిగుమతి చేయడం వలన మనదేశంలో పామోలిన్ ఆయిల్ ధరలు టన్నుకు రూ. 30,000/-ల నుండి రూ. 17,000/-లకు పడిపోయాయి. ఫలితంగా పామోలిన్ ఆయిల్ ఉత్పత్తిదారులు టన్నుకు రూ. 2300/- మించి యివ్వనన్నారు. అంతకు మునుపు సంవత్సరంలో టన్ను ఆయిల్‌పామ్ గుత్తులకు రూ. 3000/-లు యిచ్చి ఒక్కసారిగా రూ. 2300/-కు తగ్గిపోతే తోటలను రైతులు పీకివేసే పరిస్థితులు ఏర్పడతాయి. వాస్తవానికి ఎకరా భూమిలో యితర నూనె గింజల పంటలన్నింటికంటే ఆయిల్‌పామ్ ఎక్కువ నూనెను యిస్తుంది. మనదేశంలో వంట నూనెల కొరత వుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అయిల్‌పామ్‌ను ప్రోత్సహించింది. అందువలన టన్నుకు రూ. 2750/- మద్దతు ధరను రైతులకు యివ్వడంతోపాటు విదేశాల నుండి దిగుమతి అవుతున్న ఎక్రూడ్ పామోలిన్ ఆయిల్‌పైన

సుంకాన్ని బాగా పెంచాలని మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. 300 శాతం వరకు విధించడానికి అవకాశం వున్న కేంద్రం క్రూడ్ ఆయిల్ పామ్‌పైన 75 శాతం సుంకాన్ని మాత్రమే విధించింది. కుంటి నడకతో వున్న ఆయిల్‌పామ్ పరిశ్రమలకు తీసుకునే క్రూడ్ పామోలిన్ ఆయిల్‌కు 55 శాతం మాత్రమే సుంకమని బడ్జెట్‌లో అర్థికమంత్రి పేర్కొన్నారంటే మన దేశంలో వనస్పతి లాబీకి ఎంత గట్టి పట్టు వుందో అర్థమవుతుంది. మన ముఖ్యమంత్రిగారి కృషి వలన ఈ సంవత్సరం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ఒక లక్షా పదివేల టన్నుల ఆయిల్‌పామ్ గెలలను కొనడానికి కేంద్రం అంగికరించడం విశేషం. సాధారణంగా ఒక పంట ఉత్పత్తిలో 10 శాతం మాత్రమే ఈ స్కీమ్ కింద తీసుకుంటారు. అటువంటిది మన రాష్ట్రంలో పండే ఆయిల్‌పామ్ మొత్తాన్ని తీసుకోవడానికి అంగీకరించడం దేశ చరిత్రలో మొదటిసారి సాధ్యపడింది.

మనదేశంలోనికి రావడానికి అవకాశం వున్న కొన్ని వస్తువులపైన లోగడ పరిమాణాత్మక అంక్షలు వున్నందున సుంకాలు చాలా తక్కువ స్థాయిలో వున్నాయి. వీటిని బాగా ఎక్కువ చేయాలని అనేక కోణాల నుంచి వత్తిడి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం మేల్కొని కొంతమేరకు పెంచింది. ఉదా: పాలపొడిపైన 0 శాతం నుండి 60 శాతం, కోడి మాంసం, కోడి కాళ్ళు 35 శాతం నుండి 100 శాతం, బియ్యంపైన 0 శాతం నుండి 80 శాతం జొన్న, మొక్కజొన్న, సజ్జలపైన 0 నుండి 50 శాతం, గోధుమపైన 0 నుండి 50 శాతం, పంచదారపైన 27.5 శాతం నుండి 60 శాతం, కొబ్బరి, కాఫీ, టీలపైన 35 శాతం నుండి 70 శాతం, ఆపిల్స్‌పైన 35 నుండి 50 శాతంనకు యిటీవల బడ్జెట్‌లో పెంచారు. పెంచిన దరిమిలా కూడా గమనించితే మనదేశంలోకి వచ్చే వస్తువుల పైన దిగుమతి సుంకాలు తక్కువ స్థాయిలో వుండగా అభివృద్ధి చెందిన దేశాలలో దిగుమతి సుంకాలు చాలా హెచ్చుస్థాయిలో వున్నాయి. మన కేంద్ర ప్రభుత్వం యింకా ఎక్కువ స్థాయిలో దిగుమతి సుంకాలను విధించడం అవసరం.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ సుంకాలను అభివృద్ధి చెందిన దేశాలు 2000 నాటికి 36 శాతం, అభివృద్ధి చెందుతూ వున్న దేశాలు 2004 నాటికి 24 శాతం మేరకు తగ్గించాలి. అంటే అభివృద్ధి చెందిన దేశాలలో 2000 సంవత్సరం తర్వాత కూడా వారి సుంకాలు 64 శాతం మేరకు నిలబడతాయి. వర్ధమాన దేశాల నుండి ఎగుమతులు పెరగకపోవడానికి యిదొక కారణం.

## టారిఫ్ రేట్ కోటా

ఇదికాక అభివృద్ధి చెందిన దేశాలు తమ దేశంలోనికి అనుమతించే వస్తువులను కొన్ని దేశాలకు ప్రత్యేక సదుపాయం కల్పించి తీసుకుంటున్నారు. దీనిని టారిఫ్ రేట్ కోటా అంటారు. ఇందులో పారదర్శకత లోపించింది. ధనిక దేశాలు తాము వాగ్దానం చేసిన మేరకు సరుకులను దిగుమతి చేసుకోవడం లేదు. ఫలితంగా వర్ధమాన దేశాల నుండి సంపన్న దేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 19 శాతం నుండి 14 శాతం వరకు తగ్గాయని తేలింది. ఆరోగ్యం, పర్యావరణం, ప్రమాణాల పేరిట తమ ప్రయోజనాలకు ఇబ్బందులను కలుగజేస్తాయని కొన్ని ఉత్పత్తులను తమ దేశాలలోకి రాకుండా సంపన్న దేశాలు అడ్డుకుంటున్నాయి. అంతకుముందే కఠినంగా వున్న శానిటరీ, ఫైటో శానిటరీ ప్రమాణాలను మరింత కఠినతరం చేశారు. సంపన్న దేశాలలో భూకమతాల సగటు విస్తీర్ణం, వారికున్న యంత్ర సామాగ్రి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల స్థాయి వర్ధమాన దేశాలలోని పరిస్థితులతో పోలిస్తే ఎంతో తేడా వుంటుంది.

మనదేశంలో నూటికి 80 శాతం మంది సన్నకారు రైతులు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, కోత, నూర్పిడి యంత్రాల వాడకం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. అక్షరాస్యత తక్కువ. తాము వాడుతూ వున్న రసాయనిక క్రిమి సంహారక మందుల అవశేషాలు ఒక స్థాయికి మించి వుండటం విరుద్ధమని తెలియదు. తమ పంటలపైన వినియోగిస్తున్న మందులు, రసాయనిక ఎరువులు ఆరోగ్యంపైన, పర్యావరణంపైన ఎటువంటి ప్రభావం కలిగిస్తాయో చాలామందికి అవగాహన లేదు. పురుగుమందుల అవశేషాల స్థాయి కొలిచే లాబరేటరీలు అందుబాటులో లేవు. అందువలన మన ఎగుమతులు పెరగడానికి బదులు తగ్గుతున్నాయి. మొత్తం ఎగుమతులలో వ్యవసాయోత్పత్తుల వాటా మన దేశంలో 1996-1997లో 20.4 శాతం వుండగా పేద వర్గాలకు ఆహార సహాయం, ప్రకృతి వైపరీత్యాలకు అందించు సహాయం, పర్యావరణ సహాయం, పంటల భీమా పథకం ద్వారా సహాయం వంటివి కూడా తగ్గింపుల నుండి మినహాయించబడి పచ్చపెట్టి (గ్రీన్ బాక్సు)గా వర్గీకరించబడ్డాయి. ఉత్పత్తిని పరిమితం చేసే కార్యక్రమాల కింద పంట పండించకుండా భూమిని ఖాళీగా వుంచితే యిచ్చే సబ్సిడీ వంటి ప్రత్యక్ష చెల్లింపులు కూడా తగ్గింపు నుండి మినహాయించబడ్డాయి. వీటిని నీలం పెట్టె (బ్లూ బాక్స్)గా వర్గీకరించారు. ధనిక దేశాలు తమకున్న బలమైన ఆర్థిక స్థోమత వలన యిట్లా పండించకుండా వుంటే దానికి సబ్సిడీ యివ్వగల్గుతుంటే వర్ధమాన దేశాలు

తమ రైతులు అధికోత్పత్తిని సాధించుటకు అవసరమైన మేరకు సబ్సిడీలు యివ్వలేకపోతున్నాయి.

**రాయితీలు**

పైన పేర్కొన్న రెండు విధాలైన సబ్సిడీలు మినహాయింపు పొందగా ఉత్పత్తులకు ప్రత్యేకంగా యిచ్చే సబ్సిడీలు అంటే ఒక ఉత్పత్తిని నిర్ణయించిన ధరకు (మనదేశంలో కనీస మద్దతు ధరలు) దిగుమతి లేదా ఎగుమతి ధరలకు మధ్య వున్న తేడాను ఆ మద్దతు లభించిన మొత్తం మోతాదులో హెచ్చవేస్తే వచ్చే మొత్తంను తగ్గింపు వర్గీకరణలో వుంచారు. ఎరువులు, విద్యుత్, నీటి తీరువా, రాయితీపైన లభించే రుణపరపతి వంటిఉత్పాదకాలపై (ఒక ఉత్పత్తికి పరిమితం కాకుండా) ఇచ్చే సబ్సిడీలు ఈ కోవలోకి వస్తాయి. ఒక దేశ వ్యవసాయ స్థూల ఉత్పత్తిలో ఈ సబ్సిడీలు ధనిక దేశాలలో అయితే 5 శాతం, వర్ధమాన దేశాలలో అయితే 10 శాతం కన్నా మిగలరాదు. హెచ్చు వున్న దాంట్లో సంపన్న దేశాలలో అయితే 2000 నాటికి 20 శాతం తగ్గించాలి, వర్ధమాన దేశాలు అయితే 2004 నాటికి 13.3 శాతం తగ్గించాలి. భారతదేశంలో 1986-1988లో వరి, గోధుమలు మున్నగు పంటల మద్దతు ధర పరిశీలిస్తే రూ. 24,422 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లే. అదే కాలంలో ఎరువులు, విద్యుత్, నీటి తీరువా వంటి ఉత్పాదకాలపై సబ్సిడీ + రూ. 4,581 కోట్లు వెరసి ఆ సమయంలో వ్యవసాయ రంగం రూ. 19,869 కోట్ల నష్టాన్ని పొందింది. 1997-98లో చూసిన మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల సబ్సిడీ రూ. 1,04,488 కోట్లు, ఉత్పాదకాలపై సబ్సిడీ రూ. 29,674 కోట్లు, 1997-98లో వ్యవసాయ స్థూల ఉత్పత్తి విలువ సుమారు రూ. 3,50,000 కోట్లు ఉత్పాదకాలపై సబ్సిడీలో సన్నకారు, చిన్నకారు రైతులకు మద్దతులను తీసివేస్తే సబ్సిడీ రూ. 3,256 కోట్లు. మొత్తం మీద చూస్తే వ్యవసాయ రంగానికి సబ్సిడీ దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయలు నెగెటివ్ సబ్సిడీ అంటే నష్టపరచినట్లు.

1998లో అమెరికాలో వ్యవసాయ రంగానికి మొత్తం సబ్సిడీ 97 బిలియన్లు అంటే సుమారు రూ. 4,18,000 కోట్లు. మనదేశంలోని మొత్తం వ్యవసాయ రంగం స్థూల ఉత్పత్తికన్నా యిది అధికం. తలసరిన అమెరికాలో రైతుకు 30,655 డాలర్లు సబ్సిడీ లభిస్తుంది. వ్యవసాయ రంగానికి ఇస్తున్న సబ్సిడీలు మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల విలువలు అమెరికాలో 26 శాతం, యూరప్‌లో 37 శాతం, చైనాలో 34 శాతం, పాకిస్తాన్‌లో 26 శాతం, జపాన్‌లో 72 శాతం ఉండగా మనదేశంలో సుమారు 2 శాతం మాత్రమే. సంపన్న దేశాలు గాట్ ఒప్పందం దరిమిలా వారి దేశాలలో వ్యవసాయ రంగానికి సబ్సిడీలను బాగా పెంచారు. 1986-88లో ఈ దేశాలలో వ్యవసాయానికి సబ్సిడీ 308

బిలియన్ డాలర్లు వుంటే 1999 నాటికి 361 బిలియన్ డాలర్లకు పెరిగింది. రైతులకు ప్రత్యక్షంగా యిచ్చే సబ్సిడీలు సంపన్న దేశాలు అన్నిటిలో (ఓ.ఇ.సి.డి) దేశాలు 1986-88లో 246 బిలియన్ల డాలర్లు వుంటే 1999 నాటికి 283 బిలియన్ డాలర్లకు పెరిగింది.

డెయిరీ ఉత్పత్తులకు ఓఇసిడి దేశాలలో ఉత్పత్తిదారులకు 1998లో యిచ్చిన సబ్సిడీ డాలర్లు 54 బిలియన్లు. రైతులకు చేకూరిన ఆదాయంలో 58 శాతం ప్రభుత్వములు వివిధ రూపాలలో అందించిన సబ్సిడీలే.

మన భారతదేశంలోను, యితర వర్ధమాన దేశాలలో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్), ప్రపంచ బ్యాంకులు ఆర్థిక సహాయాన్ని అందించేటప్పుడు సబ్సిడీలను తగ్గించాలనీ, ఆర్థిక క్రమశిక్షణను పాటించాలనీ, ద్రవ్యలోటును రానీయరాదనీ సలహా యిస్తూ వుంటాయి. వ్యవస్థీకృత సర్దుబాటు (స్ట్రక్చరల్ అడ్జెస్ట్‌మెంట్) కార్యక్రమంలో సబ్సిడీలను తగ్గించాలని షరతులను కూడా విధిస్తూ వుంటాయి. కానీ తమ దేశాలలో వ్యవసాయరంగానికి సబ్సిడీలను మరింత హెచ్చుగా పెంచుతున్నాయి.

## ఎగుమతి సబ్సిడీలు

సంపన్న దేశాలు తమ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడం కొరకు ఎగుమతి సబ్సిడీలను కూడా ఇస్తూ వుంటాయి. 1998లో యూరోపియన్ యూనియన్ 5843 మిలియన్లు, స్విట్జర్లాండు 292 మిలియన్లు, అమెరికా 146 మిలియన్లు ఎగుమతి సబ్సిడీలను యిచ్చాయి. డెయిరీ ఉత్పత్తుల ఎగుమతులకై యూరోపియన్ యూనియన్ డాలర్లు 1461 మిలియన్లు, అమెరికా డాలర్లు 145 మిలియన్ల ఖర్చుచేశాయి. సగటున ఒక మెట్రిక్ టన్ను డెయిరీ ఉత్పత్తుల ఎగుమతికి యూరోపియన్ యూనియన్ 934 డాలర్లు, అమెరికా 1047 డాలర్లు సబ్సిడీ యిస్తుంది. ప్రపంచంలో డెయిరీ ఉత్పత్తుల వ్యాపారంలో సగం యీ సబ్సిడీలతో కూడిన ఉత్పత్తులదే. డబ్ల్యుటివో ఒప్పందం ప్రకారం ఎగుమతి సబ్సిడీ విలువ 2000 నాటికి సంపన్న దేశాలు 36 శాతం, సబ్సిడీ పొందే సరుకుల పరిమాణం 21 శాతం తగ్గించాలి. అలాగే వర్ధమాన దేశాలు 24 శాతం మరియు 14 శాతం మేరకు వరుసగా తగ్గించాలి. ప్రపంచంలో సబ్సిడీతో కూడిన 5 కోట్ల టన్నుల గోధుమల ఎగుమతులను 95 శాతంను కేవలం 5 బహుళజాతి సంస్థలే చేస్తున్నాయి. గాట్ ఒప్పందం ప్రకారం తగ్గింపు జరిగిన తరువాత కూడా 4 కోట్ల టన్నుల సబ్సిడీతో కూడిన గోధుమలను ఈ సంస్థలు చౌకగా అమ్ముతూనే

వుంటాయి. ఇదేవిధంగా తృణధాన్యాలు 22 శాతం, కోళ్ళ పరిశ్రమకు సంబంధించి 25 శాతం మేరకు బహుళజాతి సంస్థలు సబ్సిడీలు చౌకగా ప్రపంచ మార్కెట్లో అమ్ముకోగల్గుతాయి. ఫలితంగా ఉత్పత్తి వ్యయంలో సగంధరకు కార్గిల్ సంస్థ గోధుమలను అమ్మగలుగుతుంది. మొక్కజొన్నలు, గోధుమల మీద యూరోప్, అమెరికాలలో 15.2 బిలియన్ల సబ్సిడీ యిచ్చాయి. పర్యవసానంగా ప్రపంచ మార్కెట్లో ధాన్యం 23 శాతం, గోధుమలు 7.7 శాతం, మొక్కజొన్నలు 3.7 శాతం, పంచదార 25 శాతం, ప్రత్తి 15 శాతం, పామోలిన్ ఆయిల్ 34 శాతం, వేరుశనగ 16 శాతం మేరకు ధరలు పడిపోయాయని 1999 ఐఎంఎఫ్ రిపోర్టు తెలియజేసింది. గత రెండు సంవత్సరాలుగా పడిపోతున్న ధరల దృష్ట్యా అమెరికా ప్రభుత్వం అత్యవసర వ్యవసాయ సహాయం క్రింద రైతులకు అందించిన సహాయం 22 బిలియన్ డాలర్లకు చేరింది. ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే అభివృద్ధి చెందిన దేశాలలో తగ్గించవలసిన సబ్సిడీలు 2000 తర్వాత కూడా 20 శాతం తగ్గినా 80 శాతం నిలబడతాయి. ఫలితంగా గాట్ ఒప్పందం ముందు కంటే యిప్పుడు సబ్సిడీలు సంపన్న దేశాలలో పెరిగాయి.

బయో డైవర్సిటీ (జీవ వైవిధ్య బిల్లు) బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టబడింది. దీనిని త్వరలో ఆమోదించవలసిన అవసరం ఎంతైనా వుంది.

### వాణిజ్య సంస్థ - చర్చలు

కొంతకాలంగా ప్రపంచ వాణిజ్య సంస్థలో చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే సింగపూర్లో, జెనీవాలో, సియాటిల్లో చర్చలు జరిగాయి. దోహాలో త్వరలో మినిస్టీరియల్ సమావేశం జరగనుంది. డబ్ల్యుటివోలో వెనుకబడిన దేశాలు, వర్ధమాన దేశాలు మొత్తంగా 104 వున్నాయి. దేశమునకు ఒక్క ఓటు వుంటుంది. మొత్తం సభ్యదేశాలు 138 కాబట్టి భారతదేశం లాంటి వర్ధమాన దేశములు, వెనుకబడిన దేశములు ఒక అవగాహనకు వచ్చి సమిష్టిగా, దృఢంగా వ్యవహరించగలిగితే యిప్పుడు వర్ధమాన దేశములలోని వ్యవసాయ రంగమునకు చేటు చేస్తున్న అంశములను తొలగించడానికి లేక మార్పు చేయించడానికి సాధ్యపడవచ్చు. ఇందుకు వందకోట్ల జనాభాకల మన దేశం చొరవ తీసుకోవాలి. చైనా యిప్పటికీ డబ్ల్యుటివో వెలుపల వుంది. అందులో చేరాలని చైనా, రష్యా మరియు కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

## మనదేశ వ్యవసాయ పరిస్థితి - మన బాధ్యత

మనదేశంలో వ్యవసాయ జీవన విధానం. నూటికి ఎనభై మందికి జీవనాధారం. అత్యధిక ప్రజానీకానికి ఉపాధిని కల్పిస్తూ వుంది. జాతీయ స్థూల ఉత్పత్తిలో 28 శాతం సమకూరుస్తూ వుంది. వ్యవసాయ రంగంలో వున్న ప్రజల అదాయం పెరిగినప్పుడే పారిశ్రామిక రంగంలో తయారయ్యే వస్తువులకు డిమాండు పెరిగి పరిశ్రమలు వృద్ధి చెందుతాయి. సేవా రంగం కూడా వృద్ధి చెందగలదు. కాబట్టి వ్యవసాయ రంగంను పదిలంగా కాపాడుకోవాలి. అందువలన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వములతో, ఆర్థిక వేత్తలతో, శాస్త్రజ్ఞులతో, నిపుణులతో చర్చించి డబ్ల్యూటివో చర్చల్లో మనకు నష్టం కలుగజేస్తున్న అంశములను మార్పించవలసి వున్నది. డబ్ల్యూటివో నుండి వెలుపలికి రావడం సరియైన నిర్ణయం కాబోదు. ఎందుకంటే మొత్తం అన్ని దేశాలతో విడివిడిగా ద్వైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకోవాల్సి వుంటుంది. ఇది చాలా కష్టమైన పని. డబ్ల్యూటివోలో కొనసాగుతూనే మనం మనకు ఎదురవుతూవున్న యిబ్బందులను అధిగమించి మనముందు నిలిచిన సవాళ్ళను మనకు మేలు కలిగించే అవకాశాలుగా మార్చుకోవాల్సి వుంది.

మనదేశంలోని ప్రజల ఆహార అవసరాలు తీర్చడం, పరిశ్రమలకు కావాల్సిన ఉత్పత్తులు సరఫరా చేయడమే కాక యితర దేశాలకు ఎగుమతి చేయవలసిన అవసరం వుంది. విదేశీ మారకద్రవ్యం సముపార్జించాలంటే ఎగుమతులు తప్పనిసరి. లోగడ పరిమాణాత్మక ఆంక్షలు వున్నప్పటి పరిస్థితి వేరు. 2001 మార్చి 31వ తేదీన పరిమాణాత్మక ఆంక్షలు వున్న టారిఫ్ లైన్లలో చివరిగా తొలగించిన 715 ఐటెమ్‌లలో బియ్యం, గోధుమలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్లు, పండ్ల ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, కూరగాయలు, వంట నూనెలు మున్నగునవి వున్నాయి. ఇదివరలో మనదేశ అవసరాలకు మించి వుంటేనే ఎగుమతి చేయవీలుండేది. అందువలన విదేశీ మార్కెట్‌లలో మనకు కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో స్థిరమైన స్థానమును పొందలేకపోయాము. ఇప్పుడు మారిన పరిస్థితులలో ప్రపంచీకరణ జరుగుతూ సరళీకృత ఆర్థిక విధానాలు, సంస్కరణలు అమలవుతూ పరిమాణాత్మక ఆంక్షలు తొలగిన నేపథ్యంలో అనేక కోణాలలో ఆలోచించాల్సి వుంది. వివిధ దేశాలలో ముఖ్యంగా మనకు పోటీగా పంటలను పండించే దేశాలలో ఆ పంట విస్తీర్ణం ఎంత వుంది? ఉత్పత్తి ఎంతమేరకు వుండవచ్చు? అక్కడ ఆ పంటకు ధర ఎలా వుంది? అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఎంతమేరకు సరుకు రావచ్చు? మన రాష్ట్రం లోపల, మన

దేశం లోపల ఆ పంటలపై ఎటువంటి ప్రభావము పడవచ్చు అని తెలుసుకోవలసిన పరిస్థితులు యీనాడు ఏర్పడుతున్నాయి. మార్కెట్ సమాచారమును తప్పనిసరిగా సేకరించి రైతులకు సకాలములో తెలియజెప్పవలసిన అవసరం వుంది. ఇందుకోసం సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి వరుసగా మానిటరింగ్ చేయాల్సివుంది.

ఏ భూమిలో, ఏ పంటను, ఏ కాలములో, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించవచ్చునో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. సారవంతం కాని చాలా భూములలో వర్షాధార ప్రాంతాల్లో హైబ్రిడ్ ప్రత్తి పంటను రైతులు పండిస్తున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, ప్రత్తి పంట దిగుబడి సరిగా లేక రైతు ఆర్థిక భారంతో కృంగిపోతున్నాడు. అటువంటి నేలల్లో 'నరసింహ', 'సవిత', మున్నగు వెరైటీలను సాగుచేయవచ్చు. భూసార పరీక్షలను నిర్వహించి, భూమిలో వున్న మేజరు పోషకాలైన నత్రజని, భాస్వరము, పొటాషియంల ఉనికిని తెలుసుకొని తను వేయబోయే పంటకు ఏమేర ఏ పోషకాలు అందించాలో సరిగా అంచనా వేయాలి. అంతేకాక జింకు, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ పోషకాల లభ్యతను గుర్తించి లోపము వుంటే సరిచేసినప్పుడే మంచి దిగుబడి సాధ్యమవుతుంది. రసాయనిక ఎరువులకు తోడు కంపోస్టు ఎరువులు కాని, పచ్చిరొట్ట ఎరువులను కాని వాడినప్పుడే భూమిలోని సూక్ష్మజీవులు పైరుకు పోషకాలను సరిగా అందించి అధిక దిగుబడికి దోహదం చేస్తాయి. సరియైన సమయంలో సరియైన మోతాదులో పైరుకు నీటిని అందించాలి. నీటిని వృధా కానీయకుండా ఇరిగేషను సామర్థ్యమును పెంచుకోవాలి. అంతర్జాతీయ ప్రమాణాల గురించి అవగాహన లేక, పురుగు మందులు మితిమీరి వాడితే మానవుల ఆరోగ్యమునకు, పర్యావరణమునకు కలుగు హాని గురించి అవగాహన లేక ఎక్కువ మోతాదులో క్రిమి సంహారక మందులు వాడకం జరుగుతోంది. వీటి అవశేషాలు మోతాదుకు మించి వుండటంతో సంపన్న దేశాలు వీటిని తిరస్కరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మిర్చి, ప్రత్తి మున్నగు పంటలపైన చాలా అధికంగా పురుగు మందులను వాడుతున్నాము. మన వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణం మెరుగుపడాలంటే సమగ్ర సస్యరక్షణ పద్ధతులను ఆచరించాలి. జీవ నియంత్రణ పద్ధతులను అవలంబించాలి. ఈ అంశములన్నిటికి రైతులకు సరిగా తెలియపరచడం కోసం రైతుల శిక్షణా తరగతులను, క్షేత్ర విస్తరణ, ప్రదర్శన మరియు కర్షక క్షేత్ర పాఠశాలలను పెద్దఎత్తున నిర్వహించాలి. ఇందులో భాగంగా మన రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మీడియా అభివృద్ధితో కేయు బాండ్ మరియు సి బాండ్‌లు ప్రభుత్వమే నిర్వహిస్తోంది. దీని ద్వారా

రైతులకు త్వరితగతిన సమర్థవంతంగా సమాచారం అందించడమేకాక రైతులతో నేరుగా చర్చలు జరపడానికి వీలు కలుగుతోంది. వ్యవసాయ కార్యక్రమాలు సకాలంలో పూర్తవడానికి, వ్యవసాయంలో సామర్థ్యతను పెంచడానికి కొంతమేరకు యాంత్రీకరణ తప్పదు. కోత అనంతర నష్టాలను నివారించడం కొరకు రవాణా, నిల్వ, మార్కెటింగ్ మౌలిక వసతులను మెరుగుపర్చాలి. కోల్డు స్టోరేజీలను, శీతల రవాణా వాహనాలను, కోల్డు చైన్‌లను ఏర్పరచాలి. కోల్డు స్టోరేజీలకు రాయితీలో విద్యుత్‌ను సరఫరా చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. రైతులకు సకాలంలో అవసరమైన పరపతి సౌకర్యమును అందజేయాలి. ముఖ్యంగా సన్నకారు, చిన్న రైతులకు తప్పనిసరిగా పరిపతిని అందించాలి. అసలుకన్నా వడ్డీ మిగిలేందుకు వీలులేని విధంగా చర్యలు తీసికొనాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, చీడపీడల వలన కలుగు నష్టాల నుండి రైతును గట్టెక్కించగల వ్యవసాయ పంటల భీమా పథకం వుంటేనే రైతుకు శ్రీరామరక్ష! రైతులు తాము పండించిన ధాన్యం, మొక్కజొన్నలు, వేరుశనగ మున్నగు పంటల అమ్మకంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో వుంచుకొని తన సరుకు వీలైనంతగా నిర్దుష్ట ప్రమాణాలకు (specification) అనుగుణంగా వుండేటట్లు చూసుకోవాలి. అందుకై ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో అరబోయు యంత్రాలు, శుద్ధి చేయు పరికరాలు, పోతపోయు యంత్రాలను రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనావుంది. దిగుబడులు పెంచే దిశలో యాంత్రీయరణకు ప్రోత్సాహమిస్తూ మన రాష్ట్రం గత సంవత్సరం వివిధ పథకాలలో రైతులకు వరికోత యంత్రాలు, వివిధ పంటల నూర్పిడి యంత్రాలు, యూరియా వెదజల్లు పరికరాలు, పవర్ టిల్లర్లు, దమ్ము నాగళ్ళు యిత్యాది యంత్ర పరికరాల కొనుగోలుకుగాను 279 లక్షల రూపాయలు రాయితీగా యివ్వబడింది. ఈ సంవత్సరం అంటే 2001 - 2002 సంవత్సరానికి 409 లక్షల రూపాయలు కేటాయించడం జరిగింది. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు ట్రాక్టరు, పవర్ టిల్లర్లు, యితర పరికరాలపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజు సుంకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేల్సు టాక్సులను ఉపసంహరించి వాటి ధరలు బాగా తగ్గేలా చేయాలి. డ్రిప్-స్ప్రింక్లర్‌లపైన కూడా పన్నులను మాసివేయడం చాలా అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశము గురించి తగు చర్యలను వెంటనే తీసుకోవలసి వుంది. వ్యవసాయ పరిశోధనలపై హెచ్చుగా ఖర్చు చేయాల్సివుంది. నాణ్యతా ప్రమాణాల పరీక్షా కేంద్రాలను పలు ప్రదేశాలలో నెలకొల్పాలి. పేటెంట్ గురించి ప్రజల్లో అవగాహనను పెంచాలి. పేటెంటు కార్యాలయాలను ఏర్పరచాలి.

## వ్యవసాయోత్పత్తిలో మన స్థాయి

ఇప్పుడు పాలు, మామిడి, అరటి, జీడిపప్పు, కొబ్బరికాయల ఉత్పత్తిలో మన భారతదేశం ప్రథమ స్థానంలో వుంది. బియ్యం, గోధుమ, పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో రెండవస్థానంలో మన దేశం వుంది. కొన్ని పంటల విస్తీర్ణంలో మనదేశం అగ్రస్థానంలో వున్నా దిగుబడుల విషయంలో చాలా వెనుకబడి వుంది. దిగుబడుల్లో గోధుమలో 43, వరిలో 51, చెరుకులో 35, ప్రత్తిలో 62, వేరుశనగలో 70, మొక్కజొన్నలో 98, పప్పుధాన్యాల్లో 126వ స్థానంలో మన దేశం వుంది. అందువలన ఉత్పత్తి వ్యయం అధికంగా వుంది. మన ఆంధ్రప్రదేశ్‌లో అనేక పంటల ఉత్పత్తి, ఖర్చు యితర రాష్ట్రాలకన్నా అధికంగా వుంది. వరి, చెరకు, ప్రత్తి, జొన్న, మినుము, వేరుశనగ మున్నగు పంటల ఉత్పత్తి ఖర్చు మన రాష్ట్రంలో అత్యధికంగా వుంది. వేరుశనగ పంట దిగుబడి ప్రపంచ సగటు 1273 కిలో/హె, అమెరికాలో 2829 కిలో/హె, భారత్‌లో 988 కి/హె, తమిళనాడులో 1623 కి/హె కాగా మన ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 900 కి/హె వుంది. బియ్యం (వరి) పంటలో ప్రపంచ సగటు హెక్టారుకు 3827 కి., ఈజిప్టులో 8567 కి., చైనా 6331 కి., ఇండియా 2915 కి., పంజాబ్ 4728 కి., ఆంధ్రప్రదేశ్‌లో 4065 కిలోలుగా 1997లో దిగుబడులు వున్నాయి. మరొక ముఖ్యమైన వాణిజ్య పంట ప్రత్తి విషయంలో 1997లో హెక్టారుకు దూది దిగుబడి ప్రపంచంలో 584 కి., చైనా 943 కి., భారత్ 321 కి., ఆంధ్రప్రదేశ్ సుమారు 250 కిలో వుంది. ప్రత్తి పంటకు సాగు ఖర్చు మన రాష్ట్రంలో హెక్టారుకు రూ. 18085-00 వుంటే మన ప్రక్కన కర్నాటకలో రూ. 6925-00 మాత్రమే.

## డబ్ల్యుటివో దృష్ట్యా మన వ్యవసాయ విధానం - వ్యూహరచన

కాబట్టి మన దేశానికి ప్రత్యేకంగా ప్రయోజనం వున్న పంటలు ఏవి? అందులో మన ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యంగా లాభం చేకూర్చగల పంటలు ఏవి? అనే పరిశీలన చేసుకుని మనం పంటలువేసుకోవాలి. మార్కెట్ సమాచారమునకనుగుణంగా పంట విస్తీర్ణాన్ని నియంత్రించుకోవాలి. అంతర పంటలను వేసి అదనపు లాభమును పొందాలి. పంటల మార్పిడినసుసరించాలి. సాధారణంగా వేయు పంటల నుండి కొద్ది కొద్దిగా యితర ఎక్కువ ఆదాయమును యిచ్చు పంటలవైపు మరలాలి. వ్యవసాయ అనుబంధ వ్యాపకాలైన పశుపోషణ, డెయిరీ, పౌల్ట్రీ, చేపలు, రొయ్యల పెంపకాలను ఉపవృత్తులుగా చేపట్టాలి. వీటిల్లో మన రాష్ట్రమునకు మంచి అవకాశాలు వున్నాయి. ఇప్పటికే పౌల్ట్రీ రంగంలో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో వుంది. గ్రుడ్ల ఉత్పత్తి, బ్రాయిలర్ కోళ్ళ పెంపకంలో

అగ్రస్థానంలో వున్నాం. అమెరికా నుండి కోడికాళ్ళ మాంసం తక్కువ ధరలకు దిగుమతి ఐతే మన పౌల్ట్రీ రంగంనకు దెబ్బ తగలగలదు. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం 100 శాతం దిగుమతి సుంకం విధించడం వలన యీ ప్రమాదం తాత్కాలికంగా తప్పింది. దీర్ఘకాలంలో మన పౌల్ట్రీలో ఉత్పత్తి ఖర్చు తగ్గించడం, పురుగుమందుల అవశేషాలు లేని ఫీడ్‌ను వాడటం ద్వారా మన పౌల్ట్రీ ఉత్పత్తుల నాణ్యతను పెంచితే మన కోళ్ళ బ్రెస్ట్ మాంసం (breast meat) కు ఎగుమతి అవకాశాలు మెరుగ్గా వుంటాయి.

986 కి.మీ. తీర ప్రాంతంగల మన రాష్ట్రంలో, మత్స్య సంపదను బ్రహ్మాండంగా అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటికీ బ్రాకిష్ వాటర్ రొయ్యల ఉత్పత్తిలో, మంచినీటి రొయ్యల ఉత్పత్తిలో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. మత్స్య ఎగుమతుల్లో దాదాపు 25 శాతం, విదేశీ మారకద్రవ్యాన్ని మన రాష్ట్రం సమకూరుస్తుంది. చేపల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. ప్రపంచంలో చేప మాంసంనకు గిరాకీ రానురాను బాగా పెరిగిపోతుంది. మన రాష్ట్రంలో యింకా ఈ రంగంలో ప్రగతిని సాధించవచ్చు.

పాల ఉత్పత్తిలో మన దేశం యీనాడు మొట్టమొదటి స్థానంకు చేరింది. ఐతే మన నాణ్యతా ప్రమాణాలు తగినంతగా లేవని సంపన్న దేశాలు అభ్యంతరాలు పెడుతున్నాయి. కావున మన పశువుల దాణాలో పురుగు మందుల అవశేషాలు లేని విధంగా జాగ్రత్తలు తీసికోవడం, పాలసేకరణలో, ప్రాసెసింగులో ఉన్నత ప్రమాణాలను పాటించగల్గితే మన పాల ఉత్పత్తులకు మంచి డిమాండు వుంటుంది. ప్రపంచంలో అత్యధికంగా పశువులు మన దేశంలో వున్నాయి. కాని సగటు పాల దిగుబడి బాగా తక్కువ. అందువలన తక్కువ సంఖ్యలో ఎక్కువగా పాలనిచ్చు పశువులను పోషించాల్సి వుంది. ఈ వ్యవసాయ అనుబంధ వ్యాపకాల ద్వారా, అధిక ఆదాయం చేకూరడమేకాక, 'స్వయం ఉపాధి అవకాశాలు' బ్రహ్మాండంగా పెరుగుతాయి.

మనరాష్ట్రంలో పండే వరి, జీడిమామిడి, పొగాకు, పండ్లు, కూరగాయలు, పసుపు, మిర్చి, సుగంధద్రవ్యాలు, ఔషధమొక్కలు, వెనిలా మున్నగు పంటలకు ఎగుమతి అవకాశాలు వున్నాయి. ఐతే మన ఉత్పత్తి ఖర్చు తగ్గించుకుని నాణ్యతతో కూడిన సరుకును పోటీ ధరలకు అందించగల స్థితికి చేరుకోవాలి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకల చర్యలు యింక ఎంతమాత్రం జాప్యం చేయకుండా తీసికోవాల్సి వుంది.

మనదేశంలోపల వ్యవసాయ, ఆహార ఉత్పత్తులకు సరియైన గిరాకీ వుండి రైతులకు సరైన ధరలు లభించాలంటే వ్యవసాయ ఆధార పరిశ్రమలు పెద్ద సంఖ్యలో అభివృద్ధి

చెందాలి. ఇతర దేశాలలో వ్యవసాయ ఉత్పత్తులు 70 శాతం ప్రాసెస్ అవుతూ వుంటే మన దేశంలో 7 శాతం కూడా ప్రాసెస్డ్ రూపంలో మన ఆహారంను తీసికోవడం లేదు. మన ఆహార అలవాట్లు కూడా మారాలి. ఇతర దేశాల్లో వలె మన దేశంలో కూడా ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు గ్లాసు పండ్లరసం త్రాగే అలవాటు చేసుకోగల్గితే, మన పండ్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించుతాయి. ఆగ్రో పరిశ్రమల అభివృద్ధికి యూనిట్ల యజమానులు మరియు రైతుల మధ్య అవగాహన ఒప్పందం వుంటే రైతుకు సంతృప్తికరమైన ధర, పరిశ్రమదారునకు తనకు కావల్సిన ప్రమాణములతో కూడిన వ్యవసాయ ఉత్పత్తులు లభించుతాయి. అవిధముగా కాంట్రాక్టు వుండటం వలన యిరువురి ప్రయోజనాలు పరిరక్షించబడతాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు సహకారంను అందించాలి.

ఇప్పటి వరకు రైతేరాజు, దేశానికి వెన్ను రైతు అని మాటలే కాని, చేతలలో వ్యవసాయరంగం అనాదరణకు గురైంది. పరిశ్రమల్లో పెట్టుబడులను మిక్కిలిగా ఆకర్షించడం కోసం వాణిజ్య నిబంధనలు (Terms of Trade) వ్యవసాయానికి వ్యతిరేకంగా నిలపబడ్డాయి. వ్యవసాయ రంగంలో, ప్రభుత్వ పెట్టుబడులు నానాటికీ తగ్గిపోతున్నాయి. ఫలితంగా, ప్రపంచంలో వ్యవసాయకంగా అతి ప్రముఖ స్థానంలో నిలవగల అవకాశాలు అన్ని వున్నా భారతదేశం చాలా వెనుకబడింది. ఈ పరిస్థితిలో ఖచ్చితమైన మార్పు రావాలి. పారిశ్రామిక రంగానికి ఎట్టి ప్రోత్సాహకాలను, రాయితీలను అందిస్తున్నారో, ప్రత్యేక శ్రద్ధను చూపుతున్నారో అలాగే వ్యవసాయం పట్ల కూడా చూపాలి. డబ్ల్యుటివో అనంతర పరిణామాలలో యిలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారిన పరిస్థితులకనుగుణంగా వ్యవహరించాలి. రైతులు కూడా మెరుగైన అవగాహనతో యీనాటి అవసరాలకనుగుణంగా సాగు పద్ధతులను అవలంబిస్తూ గౌరవప్రదంగా వ్యవసాయ వృత్తిని కొనసాగించవలసి వుంటుంది. ప్రస్తుత పరిస్థితులలో వాణిజ్య దృక్పథమును కూడా అలవర్చుకోవడం అవసరం.

వ్యవసాయశాఖ, ప్రకాశం జిల్లా.

విజయక్రిష్ణ, ఒంగోలు.